క్లుప్తంగా

డెంగీ నివారణకు కృషి చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్

ఎలిగేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, డెంగీ నివారణకు కృషి చేద్దామని మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ సోకితే అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, శరీరంమీద దద్దుర్లు రావడం వాంతులు, వికారం, రక్తపోటు పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించి దోమలను లార్వా దశలోనే నిర్మూలిద్దామని మెడికల్ ఆఫీసర్ కోరారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు కేశవరెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు రాజేశ్వరిదేవి, ఏఎస్ఎంలు, ఆసుపత్రి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: హరితహారంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో భాగంగా గురువారం ఎంపీడీవో ఎం.ఎ.అలీం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. గోలివాడ, పెద్దంపేట, కుందనపల్లి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కల వివరాలు, మొక్కల స్థితిగతులు తదితర అంశాలపై కార్యదర్శులతో చర్చించారు. ఈజీఎస్ ఏపీవో రమేశ్ ఉన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

మంథని: కాంగ్రెస్ చర్యను నిరసిస్తూ గురువారం మంథనిలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పి కేవలం సన్న వడ్లకు మాత్రమే చెల్లిస్తామని ప్రకటన చేయడం రైతులను వంచించడమే అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి అన్నిరకాల వడ్లను కొనాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నియామకం



ఫెర్టిలైజర్‌సిటీ: జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీకి చెందిన కన్నూరి సాయితేజను నియమిస్తూ నేషనల్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గుల్వేందర్ మెహత ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా సాయితేజ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. ముర్మూర్ మిషన్‌భగీరథ గ్రిడ్ వద్ద సాంకేతిక కారణాలతో తలెత్తిన సమస్యలను మరమ్మతు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. శనివారం నుంచి ఎప్పటిలాగే నీటి సరఫరా ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

పంట రుణం వివరాలు నమోదు చేసుకోవాలి

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు తమ పంట రుణం వివరాలను సంఘం కార్యాయలంలో నమోదు చేయించుకోవాలని సంఘం సీఈవో సురేశ్ కోరారు. ప్రభుత్వ రుణమాఫీ వివరాలు కోరినందున ప్రతీ రైతు ఆధార్ కార్డు, లోన్ వివరాలను నమోదు చేయించుకోవాలని, ఈ నెల 17 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు.



అకాల వర్షాలతో అన్నదాతలు ఆగం

జూలపల్లి: అకాల వర్షాలకు అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. ఆకాశంలో మబ్బులు పడుతున్నాయంటేనే బెంబేలెత్తుతున్నారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో రైతులు పరదాలు పట్టుకొని కొనుగోలు కేంద్రాలకు పరుగుపెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



భయపెడుతున్న గ్రామసింహాలు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2ఏరియా యైటింక్లయిన్‌కాలనీ చికెన్ సెంటర్ సమీపంలోని టీ2-క్వార్టర్స్ ఏరియాలతో పాటు కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలను, ప్రధాన దారుల్లో వెళ్తున్న వాహనాదారులను గ్రామ సింహాలు భయపెడుతున్నాయి. సింగరేణి కార్మికులు డ్యూటీకి వెళ్లే సమయంలో కుక్కలు వెంబడించి కరుస్తున్నాయని వారు వాపోతున్నారు. దాదాపు 30కుక్కల గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ క్వార్టర్ల లోపలికి చొరబడుతూ భయబ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్జీ-2 సింగరేణి అధికారులతో పాటు రామగుండం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం, రామగుండం మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న చిన్నారులు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన అంగవైకల్యం గల పోడిశెట్టి రాజేశ్వరి సుల్తానాబాద్‌కు చెందిన చిన్నారులు జ్యోషిక, కౌషిక్ పొదుపు డబ్బులతో కొనుగోలు చేసిన వీల్‌చైర్‌ను గురువారం అందజేశారు. అంగవైకల్యంతో బాధపడుతున్న రాజేశ్వరికి అమ్మానాన్నలు లేరు. ఈ విషయం తెలుసుకున్న సుల్తానాబాద్‌కు చెందిన చిన్నారులు, సుల్తానాబాద్ శివాలయం చైర్మన్ అల్లెంకి సత్యనారాయణతో కలిసి వీల్‌చైర్‌ను రాజేశ్వరికి అందజేశారు. బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, నాయకులు బైరి రవిగౌడ్, బండారి ఐలయ్యయాదవ్, మార్క శ్రీనివాస్‌గౌడ్, మీర్జా అమీన్‌బేగ్, సాత్తూరి రవి, వస్తంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు..లాభాలు బాగు

- నీటి ఎద్దడికి డ్రిప్ పరిష్కారం
- ఆదర్శంగా నిలుస్తున్న జూలపల్లి రైతు



జూలపల్లిలో బీరకాయల సాగు

జూలపల్లి: వరి, పత్తి సాగు చేస్తే ఏటా సాగునీటి కష్టాలు తప్పక దిగుబడి రావడం లేదు. దీంతో జూలపల్లికి చెందిన రైతు మెండె మల్లేశం కూరగాయల సాగును డ్రిప్‌తో చేపడితే నీటి కరువుకు నష్టాల నుంచి బయట పడొచ్చని ఆలోచించి అమలు చేశాడు. కూరగాయల సాగుతో నష్టాలకు, నీటి ఎద్దడికి చెక్ పెట్టవచ్చని గ్రహించారు. దీంతో తనకున్న పది ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టాడు. మూడున్నర ఎకరాల్లో దొండ, 3 ఎకరాల్లో టమాట, 2 ఎకరాల్లో కాలీఫ్లవర్, ఒక ఎకరంలో బీర, అర ఎకరంలో కాకర సాగు చేశాడు. ప్రతీరోజు కూరగాయలను కూలీలతో తెంపి కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల వరకు సరఫరా చేస్తున్నాడు. దీంతో నష్టాల నుంచి గట్టెక్కి లాభాల సాగు వైపు మళ్లాడు. ప్రతీరోజు తనకు కూలీల ఖర్చులు పోను రూ10వేల వరకు మిగులుతాయని తెలిపాడు. ఏడాదిలో ఆరు నుంచి ఎనిమిది నెలల వరకు కూగాయల సాగు చేపట్టవచ్చని పేర్కొంటున్నారు. జూలపల్లి రైతులు చేపట్టిన కూరగాయల సాగును కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లాలోని ఇతర మండలాల రైతులు అవగాహన కల్పించేందుకు పంట క్షేత్రాల పర్యటనను చేయించారు. కూరగాయాలు సాగు చేసిన రైతులు తమ అనుభవాలను పర్యటనకు వచ్చిన రైతులకు వివరించారు.

తక్కువ నీటితో సాగు



కూరగాయల సాగులో డ్రిప్‌తో తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చు. భూసారం పెంపు, నాణ్యమైన విత్తనాలు ఎన్నుకొని నూతన వ్యవసాయ విధానంతో కూరగాయల సాగు చేపట్టాలి. అప్పుడే రైతులకు లాభాలు వస్తాయి. పంటను ప్రతీరోజు గమనిస్తూ అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలి.

– మెండె మల్లేశం రైతు, జూలపల్లి

అన్నిరకాలుగా ప్రోత్సాహం



కూరగాయల సాగు రైతులకు లాభాలు తెస్తుంది. ఆధునిక పద్ధతిలో సాగు చేసిన రైతులు ఇప్పటికే లాభాలు పొందుతున్నారు. కూరగాయల సాగుకు ప్రభుత్వ అన్నిరకాలుగా ప్రోత్సాహం అందిస్తోంది. తక్కువ నీటితో డ్రిప్ పద్ధతిలో సాగు చేయాలి. రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలి.

– జ్యోతి, ఉద్యానవనశాఖ ఏవో

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి



రాస్తారోకో చేస్తున్న చందర్, పార్టీ శ్రేణులు

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాల మభ్యపెట్టి మోసం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక మున్సిపల్ టీజంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల ముందు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నరకం వడ్లకు మాత్రమే ఇస్తామని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో 90శాతం దొడ్డు వడ్లు ఉంటాయి కాబట్టి రైతులకు అన్యాయం జరగనుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. దొడ్డువడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ పద్ధతిలో ముందుకు..



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో టీబీజీకేఎస్ ట్రేడ్ యూనియన్ పద్ధతిలో ముందుకు సాగుతుందని ఆ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌తో టీబీజీకేఎస్‌కు సంబంధం లేదని ప్రకటించే అధికారం, నైతికత మంథని బీఆర్ఎస్ ఇన్‌చార్జి పుట్ట మధుకు లేదన్నారు. టీబీజీకేఎస్ నిర్మాణాన్ని అతలాకుతలం చేసిన అనేక సంఘటనల నుంచి సంఘాన్ని కాపాడి తిరిగి కార్మికులలో నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో యూనియన్‌లో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించాలనే ఆలోచనతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా మిర్యాల రాజిరెడ్డి, కాపు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ట్రేడ్ యూనియన్ నిర్మాణ పద్ధతిలో యూనియన్ నడపాలని భావించి దానికి తగ్గట్టుగా పనిచేస్తున్నామని వివరించారు. ఈఅంశాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పార్టీకి నష్టం కలిగించే పుట్ట మధుపై చర్య తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రాంమూర్తి, పర్లపెల్లి రవి, వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, పింగిళి సంపత్‌రెడ్డి, నాగెల్లి సాంబయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని కలిసిన ముఖ్య నాయకులు



గోమాస శ్రీనివాస్‌తో బీజేపీ నాయకులు

గోదావరిఖని: బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ ముఖ్య నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, రామగుండం అసెంబ్లీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, చల్లా నారాయణరెడ్డి ఉన్నారు.

‘కేంద్రియ’లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కేంద్రియ విద్యాలయంలో 2024–25 సంవత్సరానికి గాను పదకొండో తరగతిలో సైన్స్, కామర్స్ స్ట్రీమ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ (ఇన్‌చార్జి) శోభన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీన పదో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాలు వెల్లడయ్యాయి. కాగా ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రియ విద్యాలయంలో పదో తరగతి చదివిన విద్యార్థులకు పదకొండో తరగతిలో ప్రవేశాలకు ప్రాధాన్యం ఉంటుందని, విద్యాలయంలో చదవని వారికి కూడా పదకొండో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. సైన్స్, కామర్స్ విభాగాల్లో విద్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యాలయంలో చదవని వారు దరఖాస్తుతో పాటు మార్కుల జాబితా, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, కులం, నివాసం పత్రాలను జతపర్చాలన్నారు. దరఖాస్తులు అందించేందుకు 25వ తేదీలోగా అందించాలన్నారు.

అభిమానులతో కలిసి కేక్ కట్ చేసిన పుట్ట దంపతులు



కేక్ కట్ చేస్తున్న పుట్ట మధు దంపతులు

మంథని: ప్రజలకు స్వేచ్ఛ లభించిన రోజుగా మే 16న తన జన్మదినంగా జరుపుకుంటున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు గురువారం మంథనిలోని తన నివాసంలో అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు దంపతులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ పరిధిలోని శాంతినగర్, ప్రగతినగర్, ఖాజిపల్లి, మాతంగికాలనీలో సీసీరోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించడానికి రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్ రూ.కోటి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బెంద్రం రాజిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలు కాలనీల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించి డివిజన్ అభివృద్ధి కోసం కోటి నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని భూంనగర్ ఎస్‌బీఐ (అగ్రికల్చర్ కమర్షియల్ బ్యాంకు) చీఫ్ మేనేజర్‌గా బదిలీపై వచ్చిన పవన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకాలం పనిచేసిన చీఫ్ మేనేజర్ గోపాలకృష్ణమూర్తి బదిలీ అయ్యారు. గురువారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఖాతాదారులు మేనేజర్లను సత్కరించారు.

వృద్ధాశ్రమంలో మదర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న సుచరిత, స్వప్న

ఫెర్టిలైజర్‌సిటీ: జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలో గురువారం ఈశ్వరకృప వృద్ధాశ్రమంలో మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, స్వప్న, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్ట్ సంధ్య వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ మాతృ దినోత్సవ ప్రాముఖ్యతను గురించి వారికి వివరించారు. అదేవిధంగా వృద్ధుల సంక్షేమం కొరకు టోల్ ఫ్రీ నంబర్ 14567 మహిళల వృద్ధుల హక్కులు, సేవలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈశ్వరకృప వృద్ధాశ్రమం అధ్యక్షులు పిటి స్వామి, గంట సత్తయ్య, జాక సత్యనారాయణ, అక్కిరెడ్డి రామచందర్‌రావు, మాధవరెడ్డి, బట్టల సత్తయ్య, కోటగిరి వాసు, ఆశావర్కర్ రజిత, ఆర్పీ స్నేహలత, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన



కొనసాగుతున్న పనులు

రామగుండం: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో గ్రామాల వారీగా నియామకమైన ప్రతినిధులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించారు. కుందనపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కుళాయిల బిగింపు పనులు, మరుగుదొడ్ల నిర్మాణం, వాటన్నింటికీ నీటి సరఫరా పనులు చేపడుతున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి పూర్తి స్థాయి వసతులతో రూపుదిద్దుకోనున్నాయని ఐకేపీ ఏపీఎం సంది నర్సమ్మ పేర్కొన్నారు.

కబ్జాదారుల నుంచి ప్రశాంత్‌నగర్ స్థలం కాపాడండి

గోదావరిఖని: కబ్జాదారుల నుంచి గోదావరిఖని ప్రశాంత్‌నగర్ కాలనీవాసుల స్థలాన్ని కాపాడాలని ప్రశాంత్‌నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు దూలం పోషం, చీమల తిరుపతి కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25ఏళ్ల క్రితం వీర్లపల్లి, వెంకట్రావుపల్లిలో నివాసమున్న తమను ఓసీపీ త్రీ ప్రాజెక్టు కోసం సింగరేణి తరలించి ప్రశాంత్‌నగర్‌లో స్థలాలను కేటాయించారన్నారు. సింగరేణి యాజమాన్యమే అన్ని వసతులను కల్పించిందని, తమ కాలనీలో గుడిని ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారన్నారు. దాన్ని ఆక్రమించేందుకు కొందరు జీవో76 ప్రకారం దొంగపట్టాలను సృష్టించారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు కబ్జా విషయంలో చొరవ తీసుకొని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డుపైన కోడి ఎరువు పడి దుర్వాసన

- రైతుతోనే తీయించిన మున్సిపల్ సిబ్బంది



సుల్తానాబాద్‌లో నిలిపివేసిన ట్రాక్టర్

సుల్తానాబాద్: పట్టణంలో గురువారం కోడి ఎరువుతో వెళ్తున్న ట్రాక్టర్ నుంచి కోడి ఎరువు కింద పడడంతో దుర్వాసన వెదజల్లింది. మున్సిపల్ సిబ్బందికి స్థానిక వ్యాపారులు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్లు సిబ్బంది నిలిపివేశారు. రోడ్డు మీద పడిన కోడి ఎరువును ట్రాక్టర్ డ్రైవర్‌తో తొలగించారు. ఓవర్ లోడ్ కోడి ఎరువు తీసుకుని వెళ్లడంతో రోడ్డు మీద పడి ప్రజలు, ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ట్రాక్టర్ యజమానులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బంది సూచించారు. ట్రాక్టర్‌పై పరదా కప్పుకొని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన ఆలయం

ధర్మారం: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 24 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ తెలిపారు. ఈ నెల 17న దివ్య ప్రబంధ పారాయణం, తొళక్కము, 18న సేవాకాలం, పదోత్సవం 19న భగవత్ పుణ్యాహవచనం, రక్షాబంధనం, స్వామివారి రితుక్కల్యాణోత్సవం 20న హవనం బలిహరణం, 21న గరుడ వాహనం నరసింహ జయంతి, 22న దోపోత్సవం, గురడవాహన సేవ, అరగింపు హారం 23న జాతర ప్రారంభం, 24న స్వామివారి రథోత్సవం జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

రత్నాపూర్‌లో పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 22 వరకు నిర్వహించనున్న ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా గురవారం మహిళలు పోచమ్మకు బోనాలు సమర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర ఓదెలు, దేవాలయ చైర్మన్ ముక్కెర కుమార్, సభ్యులు కెక్కర్ల శ్రీనివాస్, కెక్కర్ల సమ్మయ్య, ముక్కెర సతీశ్ పాల్గొన్నారు.